ఇజ్రాయేలు కుటుంబానికి మాజీమంత్రి పరామర్శ

బడంగ్‌పేట్, మార్చి 28 : మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామానికి చెందిన దివంగత ఎర్రబాపు ఇజ్రాయేలు కుటుంబ సభ్యులను శుక్రవారం మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. న్యాయవాదులను హత్య చేయడం దురదృష్టకరమన్నారు. న్యాయవాదులకే భద్రత లేకపోతే ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. హంతకులను కఠినంగా శిక్షించాలన్నారు. మాజీ మంత్రి వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ముగిసిన మహా పాదయాత్ర

సైదాబాద్, మార్చి 28: కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గోరక్షణ, భూరక్షణ, పర్యావరణ రక్షణ కోసం, గోమాతతో చేపట్టిన మహాపాదయాత్ర ముగిసిందని సైదాబాద్‌కు చెందిన బాలకృష్ణ గురుస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 182 రోజులు 5,150 కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేసి శ్రీ వివేకానంద రాక్ మెమోరియల్‌కు చేరుకోవడంతో పాదయాత్ర ముగిసిందన్నారు. ముగింపు సభను కన్యాకుమారిలోని వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గోరక్షణ విశిష్టతను తెలియపరిచారు.

అగ్ని ప్రమాదం

అబిడ్స్, మార్చి 28: గోడేకి కబర్ ప్రాంతంలోని ఓ మిఠాయి షాపులో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దుకాణం మూసిన తర్వాత షార్ట్ సర్క్యూట్ జరగగా అందులో ఉన్న సిలిండర్ పేలి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న షాహినాయత్‌గంజ్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందిని రంగంలోకి దింపడంతో వారు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

సమాజాభివృద్ధిలో మహిళ లది కీలకపాత్ర

- ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ మంత్రి టీజీ వెంకటేశ్
- అట్టహాసంగా తెలంగాణ రాష్ట్ర మహిళా ఆర్యవైశ్య మహాసభ

మన్సూరాబాద్, మార్చి 28: నాగోల్ డివిజన్ బండ్లగూడలోని కన్వెన్షన్ హాల్లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ ఉప్పల శారద, ప్రధాన కార్యదర్శి కాచం సుష్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ప్రతి రంగంలోనూ పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు అవుతుండటం గొప్పవిషయమన్నారు. అనంతరం నిర్వహించిన ఫ్యాషన్ షో, పూడి నృత్య కళాకారిని పద్మజారెడ్డి, ప్రముఖ గాయని కౌసల్య, ఆర్యవైశ్య మహాసభ అడిషనల్ జనరల్ సెక్రెటరీ సామ్రాజ్యలక్ష్మి, మాజీ అధ్యక్షురాలు అంబాల లక్ష్మీభవాని, తిరుమలేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహిళా మహోత్సవంలో మాట్లాడుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మతాలకతీతంగా పండుగలు జరుపుకోవాలి : ఎమ్మెల్యే

హయత్‌నగర్ : కులమతాలకతీతంగా పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ పాత గ్రామంలోని చిన్న మసీదు వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి, సీనియర్ నాయకులు మల్లేశ్ ముదిరాజ్, భాస్కర్ సాగర్, అమీర్, నవీద్, హలీమ్, పలువురు నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



హయత్‌నగర్ : ఇఫ్తార్‌విందులో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

తెలుగు ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

ఎల్బీనగర్ : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర త్రైతశకం 47 వ సం" తెలుగు ఉగాది కాలెండర్‌ను శుక్రవారం ఎల్బీ నగర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం క్యాలెండర్లను కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి వారు రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచిక ప్రతి ఒక్కరికీ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. తెలుగు పండుగలు, తెలుగు నెలల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకముల సారముతో పాటు భగవద్గీత సారాంశం ఇందులో పొందుపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు, సభ్యులు సీహెచ్ గిరి, ఎన్ఎస్ కుమార్, చంద్రశేఖర్, సీహెచ్ మధు పాల్గొన్నారు.

తెలుగు సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసిన కాలనీ వాసులు

ఎల్బీనగర్ : చైతన్యపురి డివిజన్‌లోని న్యూ దిల్‌సుఖ్‌నగర్, ద్వారకాపురం, న్యూ ఇందిరా నగర్ కాలనీల్లో సీసీ రోడ్లు మంజూరు చేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కాలనీ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ చైతన్యపురి డివిజన్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, న్యూ దిల్‌సుఖ్‌నగర్‌కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేశ్వర్, జనరల్ సెక్రటరీ రోజా పద్మిని, సంతోష్, భాస్కర్, ద్వారకాపురం సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు ప్రసాద్, అజయ్, సుబ్బారెడ్డి, అర్చన, కవిత, అనూరాధ, జ్యోతి,న్యూ ఇందిరానగర్ కాలనీ అధ్యక్షుడు నరేశ్, కాలనీ సభ్యులు శివ, కృష్ణ, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను టీజీఐఐసీకి అప్పగించాలి

రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవోలు జగదీశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి

కందుకూరు, మార్చి 28 : గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను టీజీఐఐసీకి అప్పగించాలని కందుకూరు, ఇబ్రహీంపట్నం ఆర్డీఓలు జగదీశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కందుకూరు ఆర్డీవో కార్యాలయంలో కందుకూరు, యాచారం మండలాల రెవెన్యూ అధికారులతో వారు సమావేశం నిర్వహించారు. ఎలాంటి వివాదం లేకుండా సేకరించిన భూములకు హద్దులు ఖరారు చేసి టీజీఐఐసీకి అప్పగించాలని సూచించారు. కాగా రెండు మండలాల్లో దాదాపు 12వేల ఎకరాల మేర రైతులకు నష్టపరిహారం చెల్లించి వివాదాలు లేకుండా ఉన్నట్లు సమాచారం. తక్షణమే ఆ భూములను టీజీఐఐసీకి అప్పగించడానికి కృషి చేయాలని స్థానిక రెవెన్యూ అధికారులకు వారు సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల రెవెన్యూ సిబ్బంది, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

కాచిగూడ,మార్చి 28: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లలో 42శాతం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లుకు కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, షెడ్యూల్ 9లో పొందుపరచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కోరారు. శుక్రవారం కాచిగూడ అభినందన హోటలలో విలేకరులతో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా సమగ్ర కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు సన్మార్గంలో పయనించాలి

సినీ నటుడు సుమన్ ను సన్మానిస్తున్న హైదరాబాద్ టెక్నో స్కూల్ యాజమాన్యం

కందుకూరు, మార్చి 28 : విద్యార్థులు చేతుల్లోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని, విద్యార్థులు సన్మార్గంలో పయనించాలని సినీ నటుడు సుమన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని హైదరాబాద్ టెక్నో స్కూల్‌లో జరిగిన 14వ వార్షికోత్సవంలో సుమన్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ రఘురాంరెడ్డి, ప్రిన్సిపాల్ కవితలక్ష్మి, బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి, ప్రైవేట్ పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి,కోశాధికారి మహేందర్‌రావు, నోబుల్ హైస్కూల్ కరస్పాండెంట్ బైరు కొండల్ రెడ్డి, మహేందర్, ఉపాధ్యాయులు. విద్యార్థులు. తల్లిదండ్రులు పాల్గొన్నారు.

31న మిమిక్రీ, వెంట్రిలాక్విజమ్ ఫెస్టివల్

తెలుగు యూనివర్సిటీ, మార్చి 28. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో మార్చి 31న మధ్యాహ్నం 2 గంటల నుంచి రవీంద్రభారతి మొదటి అంతస్థులో గల సమావేశ మందిరంలో మిమిక్రీ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిమిక్రీ, వెంట్రిలాక్విజం కళాకారులు పాల్గొననున్న మిమిక్రీ సింఫనీ ఫెస్టివ్ హార్మొనీ శీర్షికతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మిమిక్రీ కళాకారుల సంఘం అధ్యక్షుడు జీవీఎన్ రాజు శుక్రవారం తెలిపారు. ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్టులు శివారెడ్డి, భవిరి రవి, జితేంద్రనాథ్ ఆర్‌పీఎం రాజు, గురుస్వామి, మల్లం రమేశ్, శాంతికుమార్, రాకింగ్ రాకేశ్, అంజన్ కుమార్, శివ ప్రసాద్, శివ భవిరి, రాంబాబు, అశోక్, సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్, కపర్తి నరేశ్, శంకర్, మురళీకృష్ణ, యాదవ్ ప్రేక్షకులను అలరించే మిమిక్రీ, వెంట్రిలాక్విజమ్ అంశాలను వేదికపై ప్రదర్శించి ఈ కళను భావితరాలకు అందించవలసిన ఆవశ్యకతపై ప్రసంగించనున్నారని తెలిపారు. కళాకారులు ఆహుతులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేయనున్నారని ఆయన పేర్కొన్నారు. యాంత్రిక జీవనశైలిలో ఒత్తిడితో గడుపుతున్న సమాజానికి మిమిక్రీ ఆర్టిస్టులు తమ ప్రతిభతో ఉపశమనం కలిగిస్తారని అన్నారు.

దొడ్డి కొమురయ్య సేవలు మరువలేనివి

అబిడ్స్ మార్చి 28: దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ, రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు ఎగ్గే మల్లేశం తెలిపారు. దొడ్డి కొమరయ్య ఉత్సవ కమిటీ వాల్ పోస్టర్‌ను ఆయన కమిటీ చైర్మన్ తూముకుంట అరుణ్ కుమార్‌తో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య పోరాటం మరువలేనిది అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఆయన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడంపై మల్లేశం సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఉత్సవ కమిటీ ప్రతినిధులను మల్లేశం అభినందించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ తూంకుంట అరుణ్‌కుమార్, మంగా వెంకటేశ, దొడ్డి చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ముస్లింలు

కందుకూరు, మార్చి 28 : వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు 2024కు వ్యతిరేకంగా ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు రంజాన్ చివరి శుక్రవారం జమాతుల్ విధా సందర్భంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు మండలంలోని నేదునూరు జామియా మసీదు వద్ద ముస్లింలు బిల్లుకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జిలు ధరించి శాంతియుతంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కందుకూరు మండల కోర్డినేటర్ ఎండీ అఫ్జల్ బేగ్ మాట్లాడుతూ.. సవరణ బిల్లును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేదునూర్ జామి యా ముస్లిం సంఘం అధ్యక్షుడు ఎండీ నిజాముద్దీన్, ఇబ్రహీం, మున్వర్, ఫర్వేజ్, అజరుద్దీన్, ఎండీ అలీమ్ బేగ్, సల్మాన్, సర్దార్, అన్వర్‌బేగ్, ఎండీ నయూమ్ బేగ్, నదీమ్ బేగ్, ఫయాజ్‌బేగ్, అఫ్సర్, ఇంతియాజ్‌బేగ్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ కిట్ల పంపిణీ

సైదాబాద్, మార్చి 28: చావుని డివిజన్ పరిధి పిల్లిగుడిసెల డబుల్ బెడ్‌రూమ్ డిగ్నిటీ హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీలో శుక్రవారం రం జాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని పేద ముస్లింలకు నితావసర వస్తువులను అందజేశారు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ముఖ్యఅతిథిగా హాజరై పేద ముస్లిలందరికీ రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉన్న పేద ముస్లింలకు చేయూతనివ్వాలని సంకల్పంతో నితావసర కిట్లను అందజేస్తున్నామన్నారు. చావుని డివిజన్ కార్పొరేటర్ సలాం షాహిద్, మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజాన్ కిట్లను అందజేస్తున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల

రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. బీఏ లాంగ్వేజెస్ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మెమోలను సంబంధిత కళాశాలల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చన్నారు. ఈ రీవాల్యూయేషన్ కోసం ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి వచ్చే నెల లోగా టీఎస్ ఆన్లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ. 200 అపరాధ రుసుముతో వచ్చే నెల 4 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పరీక్ష జవాబు పత్రాల నకలు పొందగోరేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 4 వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అనాథ విద్యార్థులను ఆదుకోవాలి

కందుకూరు, మార్చి 28 : అనాథ విద్యార్థులను ఆదుకొని మానవత్వం చాటాలని మండలంలోని నేదునూరు ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌శర్మ అన్నారు. పాఠశాలలో చదువుతున్న 21 మంది అనాథ విద్యార్థులకు అదే పాఠశాలలో పనిచేస్తున్న పీడీ ఎండీ అబ్దుల్లా ఉచితంగా స్కూల్ డ్రెస్‌లతో పాటు మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పేద విద్యార్థులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్లోరీ, అంత కుమారి, శ్రీవాణి, కరుణాకర్, కౌసల్య, సర్వర్ శ్రీశైలం విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

అదృశ్యమైన నితిన్‌రెడ్డి(ఫైల్)

మన్సూరాబాద్, మార్చి 28: నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. నాగోల్ బండ్లగూడ, ఆనంద్ నగర్‌కాలనీలో ఏనుగు రామిరెడ్డి అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. రామిరెడ్డి పెద్ద కుమారుడు ఏనుగు నితిన్‌రెడ్డి(24) ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. అమెరికాలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఇండియాకు వచ్చేస్తానంటూ మూడు నెలలుగా తండ్రితో చెబుతున్నాడు. ఈనెల 25న నితిన్‌రెడ్డి ఇండియాకు వచ్చేశాడు. 27న ఉదయం 11:40 నిమిషాల సమయంలో లాప్టాప్, బట్టలు తీసుకొని కోచింగ్ తీసుకునేందుకు బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయాడు. తిరిగి నితిన్‌రెడ్డి ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు అతడి ఆచూకీ కోసం బంధువులు, మిత్రుల ఇండ్లలో వెతికినప్పటికీ జాడ తెలియరాలేదు. యువకుడి తండ్రి రామిరెడ్డి ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

సైదాబాద్, మార్చి 28: సింగరేణి కాలనీ బాంబే క్వార్టర్స్‌లో నివసించే ఓ యువతి తన అక్క ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్సై సాయికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధిపేట జిల్లా నాగరాజుపాలెం గ్రామానికి చెందిన సాయిలు కుటుంబం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కూలి పని చేసుకుంటూ సింగరేణికాలనీలో నివాసం ఉంటున్నారు. సాయిలు కుమార్తె ప్రీతి(21) శుక్రవారం వారి ఇంటి సమీపంలో నివసించే సోదరి ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా ఆమె గత మూడు నెలలుగా కామెర్ల వ్యాధితో బాధపడుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీ సులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. ప్రీతి మృతికి గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

ఆస్తిపన్ను వసూలు లక్ష్యం నెరవేరేనా?

- అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఇప్పటివరకు 48 శాతమే వసూలు

బడంగ్‌పేట్, మార్చి 28: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2024– 25 ఆర్థిక సంవత్సరానికిగాను అధికారులు రూ. 39.52 కోట్ల ఆస్తిపన్ను వసూలు లక్ష్యాన్ని చేరుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఆస్తిపన్ను వసూలులో సీడీఎంఏ ఇప్పటికే అధికారులకు చివాట్లు పెట్టి షోకాజు నోటీసులు జారీ చేసింది. అయినా లక్ష్యాన్ని చేరుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇందుకు అధికారుల మధ్య కొరవడిన సమన్వయమే కారణమని జోరుగా చర్చ జరుగుతోంది.

గత ఏడాది రూ. 25 కోట్లు డిమాండ్ ఉండగా రూ.19 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయగలిగారు. ఈఏడాది ఆస్తిపన్ను లక్ష్యం రూ. 39.52 కోట్లు ఉండగా ఇప్పటివరకు 48% మాత్రమే వసూలైనట్టు తెలుస్తున్నది. శుక్రవారం ఒక్కరోజు మాత్రమే ఆస్తిపన్ను వసూలు చేయడానికి అవకాశం ఉన్నది. వరుసగా రెండు రోజులు ఉగాది, రంజాన్ పండుగల సెలవులు వస్తున్నాయి. అనుకున్న స్థాయిలో ఆస్తి పన్ను వసూలు చేసే పరిస్థితి కనిపించడంలేదు. ప్రభుత్వం వడ్డీలో 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రెండు రోజుల ముందు 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ప్రకటించడంతో ఆస్తి పన్ను వసూలుకు వెళ్లిన మున్సిపల్ సిబ్బందితో ప్రజలు ఘర్షణకు దిగుతున్నారు. తమకు ఈ విషయం తెలవదని చెప్పినప్పటికీ ఇప్పటికే ఆస్తి పన్ను చెల్లించిన వారు గొడవకు దిగుతున్నారు. ఆస్తి పన్ను వసూలు చేయడానికి పోవాలంటేనే మున్సిపల్ సిబ్బంది వణుకుతున్నారు. తాము ముందు కట్టిన ఆస్తి పన్నుకు 90 శాతం రాయితీ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. దాంతో సిబ్బంది అధికారుల వద్ద గోడు వెళ్ళబోసుకుంటున్నారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలతో కిందిస్థాయి సిబ్బంది ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తున్నది. ఎలాగైనా వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయవలసిందేనని పై అధికారులు కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు డోలాయమానంలో పడ్డారు. అధికారులు లక్ష్యాన్ని చేరుకుంటారో లేదో వేచిచూడాలి.

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

బట్టల షాపులో చోరీ

ఎల్బీనగర్, మార్చి 28 : షాప్‌లో బట్టలు కొనుగోలు చేసేందుకు వచ్చిన మహిళలు చోరీకి పాల్పడిన సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దినేశ్‌కుమార్ శర్మ అనే వ్యక్తి పురాణాపూల్ బహదూర్ పురాలో నివాసం ఉంటున్నాడు. గత రెండేండ్లుగా మార్గదర్శి కొత్తపేటలో కేఆర్ కసత్ పేరుతో ఫాబ్రిక్స్ బట్టల షాపు నడుపుతున్నాడు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు గుర్తుతెలియని ఐదుగురు మహిళలు షాప్‌లోకి దుస్తులు కొనేందుకు వచ్చి అపహరించినట్లు యజమాని చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కోర్టు అధ్యక్షుడిగా అమరేందర్ రెడ్డి

మల్లాపూర్, మార్చి 28 : మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్.అమరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కే మాధవి, ప్రధాన కార్యదర్శిగా వి. బాపిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా పీవీ ధనలక్ష్మి, కోశాధికారిగా కే మురళి, లైబ్రరీ అనగా ఎం.వెంకటేశ్, స్పోర్ట్స్ సెక్రటరీగా ఎస్.శివ కుమార్, మహిళా సెక్రటరీగా టి.రేణుకా దేవి, ఈసీ మెంబర్లు రాధా ప్రసన్న, దినేశ్, సాయి సౌరేశ్రావణ్, సాయి సందీప్, ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు.

నిర్మానుష్య ప్రదేశంలో చెలరేగిన మంటలు

వీరన్నగుట్ట సమీపంలో ఎగిసిపడుతున్న మంటలు

హయత్ నగర్, మార్చి 28 : ప్రమాదవశాత్తు నిర్మానుష్య ప్రదేశంలో మంటలు చెలరేగాయి. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్సూరాబాద్ డివిజన్ వీరన్నగుట్ట వెనుక నిర్మానుష్య ప్రదేశంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసిపడ్డాయి. వెంటనే అప్రమత్తమైన చుట్టుపక్కల కాలనీలవాసులు హుటాహుటిన చేరుకొని నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు. కూతవేటు దూరంలో ఇండ్లు ఉండడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. వేసవికాలం దృష్ట్యా అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచించారు.

ఆకట్టుకున్న నాటకోత్సవాలు

కళాకారులకు పురస్కారాలు అందించిన జగన్మోహన్‌రావు

ముషీరాబాద్, మార్చి 28: శ్రీరామకృష్ణ నాట్య మండలి ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా పద్య నాటక వైభవాలు పేరిట నాటక ఉత్సవాలు నిర్వహించారు. చిక్కడపల్లి త్యాగరాయగానసభలో పాండవ ఉద్యోగం, చింతామణి నాటకం ప్రేక్షక రంజకంగా నిర్వహించారు. అనంతరం పలువురు రంగస్థలం నాటులకు శ్రీరామకృష్ణ నాట్యమండలి ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ జగన్మోహన్‌రావు పురస్కారాల అందించి సత్కరించారు. తడక మల్లరామచంద్రరావు, వేటూరి హరినాథ్, దేవనాదసూరి పురస్కారాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వి.సూర్యప్రకాశ్, గంధం రాజేశ్వరి, జె.శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీపై అసత్య ప్రచారం చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు

సైదాబాద్, మార